
ఇబ్రాం శేఖర్ తల్లికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

## డిప్యూటీ మేయర్ తల్లికి ఎమ్మెల్యే సబిత నివాళి

**సరూర్‌నగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ తల్లి ఇబ్రాం నర్సమ్మకు రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. నర్సమ్మ అనారోగ్యంతో పది రోజుల క్రితం మరణించిన సంగతి తెలిసిందే. ఆమె దశదినకర్మ శనివారం బాలాపూర్‌లోని వైబీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించగా, సబితారెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులు, బీఎస్పీ, డీఎస్పీ నేతలు, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సైతం పాల్గొని ఆమెకు నివాళులర్పించారు.


వరద నీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

## కాల్వ పనులు నాణ్యతగా చేపట్టాలి

**చంపాపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీ నుంచి జయకృష్ణా ఎన్‌క్లేవ్ వరకు కొనసాగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ సుజాతానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాల్వ నిర్మాణ పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను కోరారు. కార్యక్రమంలో అగ్రికల్చర్‌కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమత కాలనీ ప్రతినిధులు జితేందర్‌రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

**చాదర్‌ఘాట్, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సిటీ సివిల్ కోర్టు జడ్జి సాయికిరణ్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి శనివారం ప్రారంభించారు. మలక్‌పేట కల్యాణ్ నగర్ కాలనీలో రాపోలు రాజ్యలక్ష్మి రాములు స్మారకార్థం హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలపై పట్టు సాధిస్తే న్యాయవాది వృత్తిలో రాణించగలుగుతారన్నారు. ఔత్సాహిక ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని రాపోలు భాస్కర్ వివరించారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసిందని, ఈనెల 23న పరీక్ష జరగనుందని ఆయన వివరించారు. నిపుణుల ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

## బాక్స్ డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలి

**కొత్తపేట:** బృందావన్‌కాలనీ వద్ద జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన, జీహెచ్‌ఎంసీ ఏఈ మాతృనాయక్‌తో కలిసి బృందావన్‌కాలనీ సమీపంలో బాక్స్‌డ్రెయిన్ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమారు రూ. కోటీ30లక్షల వ్యయంతో డివిజన్ పరిధిలోని గాయిత్రీపురం, ఎస్ఆర్ఎల్‌కాలనీ, బృందావన్‌కాలనీల మీదుగా మూసీ వరకు బాక్స్‌డ్రెయిన్ పనులు చేపట్టారు. ప్రస్తుతం బృందావన్‌కాలనీ వద్ద పనులు కొనసాగుతున్నాయి. మూసీ సమీపంలో నిర్మించిన హెచ్‌ఎండీఏ వాకింగ్ ట్రాక్ ప్రాంతానికి సుమారు నెల రోజుల తర్వాత డ్రెయిన్ పనులు చేరుకుంటాయని కార్పొరేటర్ తెలిపారు.



కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటిన హస్తినాపురం డివిజన్ బాలికలు

## ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన

**చంపాపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** హస్తినాపురం డివిజన్‌కు చెందిన గురువు కోమల్‌బాబు మాడు శిష్యులు పలువురు చిన్నారులు ఇటీవల కేరళ రాష్ట్రం త్రిసూర్‌లోని పెరింగోటుకర విష్ణు మాయా ఆలయంలో శతాబ్ది నృత్యోత్సవంలో నిర్వహించిన కూచిపూడి ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. ఆలయ చైర్మన్ డాక్టర్ ఉన్నిస్వామి కల్ నృత్యకారులకు ప్రశంసాపత్రం, షీల్డ్‌లను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురూజీ కోమల్‌బాబు మాడు, శిష్యులు కౌశిక, వేదాక్షర, భవ్య, యాక్షిక, చైత్ర, మౌనిక, దిషిత, దుర్గా, కీర్తన, సాయిశృతి, చాయిత్ర, శృతి, ప్రియాంక, ప్రణవి, సాహితి, అనన్య, మీనాక్షి పాల్గొన్నారు.

## వర్షాలతో 14 ఎంయూలు తగ్గిన విద్యుత్ డిమాండ్..!

- 86 నుంచి 72 మిలియన్ యూనిట్లకు పడిపోయిన వినియోగం

**హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** వర్షాలతో గ్రేటర్‌లో రోజు వారీ విద్యుత్ డిమాండ్ 14 మిలియన్ యూనిట్లు తగ్గింది. జూన్ 1వ తేదీన గ్రేటర్‌జోన్‌లో 86 మిలియన్ యూనిట్లుగా నమోదైన విద్యుత్ డిమాండ్ 7 నాటికి 72 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. వర్షాల కారణంగా నాలుగురోజులుగా రోజువారీ విద్యుత్ వినియోగం 72-73 మిలియన్ యూనిట్లుగా మాత్రమే నమోదవుతుంది. గ్రేటర్‌లో శనివారం(జూన్ 1న) 4,046 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదవగా, శుక్రవారం(జూన్ 7) నాటికి 3,412 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది.


### ప్రత్యేక చర్యలు..

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. సెక్షన్, డివిజన్లలో అదనపు సిబ్బంది నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాటు 24 గంటలు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సిబ్బందితో పాటు ఆపరేషన్ వింగ్ ఏఈ, ఏడీఈ, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యటించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ లైన్లపై చెట్లకొమ్మలు తొలగించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ తీగలు వేస్తున్నారు. విద్యుత్ మరమ్మతులు చేపట్టే సిబ్బంది తప్పనిసరిగా భద్రత సూత్రాలు పాటించాలని, అధికారుల పర్యవేక్షణలో పనులు నిర్వహించాలంటూ ఇప్పటికే టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ అధికారులను ఆదేశించారు.

## సికింద్రాబాద్ నుంచి 19వ భారత్ గౌరవ్ రైలు

- సీనియర్ సిటిజన్స్‌తో ప్రారంభించిన అధికారులు

**హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** పుణ్యక్షేత్రాల యాత్రకు సికింద్రాబాద్ నుంచి ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసిన 19వ భారత్ గౌరవ్ రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి శనివారం ప్రారంభమైంది. దీనిని ప్రయాణికుల్లో సీనియర్లు దినేష్ చుట్కే(75), సతీమణి సాధనా చుట్కే(63) సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జెండా ఊపడంతో భారత్‌గౌరవ్ రైలు ప్రయాణం ప్రారంభమైంది. అయోధ్య-కాశీ వెళ్లే ప్రయాణీకుల నుంచి ఈ రైలు ఎంతో ఆదరణ పొందిందని, వంద శాతం పూర్తి ఆక్యుపెన్సీతో బయలుదేరిందని ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ పి.రాజీకుమార్ తెలిపారు. దేశంలో ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి భారత్ గౌరవ్ రైళ్లు పెద్దపీట వేస్తున్నాయని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.


రైల్లోకి ప్రవేశిస్తున్న సీనియర్ సిటిజన్లు దినేష్, సాధన

# ఈ రోడ్డుపై నడిచేదెలా..

- నాదర్‌గుల్-తుర్కయంజాల్ రోడ్డుపై కంకర పరిచి వదిలేసిన కాంట్రాక్టర్


కంకర కొట్టుకుపోగా రోడ్డు అంచుల వద్ద ప్రమాదకరంగా మారిన దృశ్యం

**సరూర్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నాదర్‌గుల్-తుర్కయంజాల్ ప్రధాన లింకు రోడ్డు యంజాల్ విలేజ్ నుంచి గుర్రంగూడ వై జంక్షన్ వరకు గల రోడ్డు దాదాపు ఏడేళ్లుగా విస్తరణకు నోచుకోక అస్తవ్యస్తంగా మారింది. విస్తరణ కోసం పరిచిన కంకర కొట్టుకుపోయి రోడ్డు అంచుల వెంట లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రోడ్డు మీద సైతం అనేక చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. తుర్కయంజాల్ విలేజ్ వద్ద పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులు, పాలకులు, కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


విస్తరణ కోసం కంకర పరిచిన రోడ్డుపై ఏర్పడిన గుంతలు

## స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

**చంపాపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శనివారం స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ జ్యువెలరీ షాప్‌ల మూలంగా ఉపాధిని కోల్పోతున్న స్వర్ణకారులకు చేయూతనందించాలని రాఘవాచారి మంత్రిని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో చేతి వృత్తులకు మంచి రోజులు వస్తాయని ఆశించినా ఇప్పటికీ తమకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న 5మెన్ కమిటీ రిపోర్టును యథాతథంగా అమలు చేయాలని, తమిళనాడు రాష్ట్రంలో ఉన్న విధంగా మన రాష్ట్రంలో కూడా స్వర్ణకార వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన మంత్రిని కోరారు. స్వర్ణకారులు వృత్తిలో ఉంటూ అకాల మరణం సంభవిస్తే ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, పెన్షన్ బీమా సౌకర్యంతో పాటు స్వర్ణకారులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. మా సమస్యలను రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చించి తగు న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు రాఘవాచారి తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేవూరి వెంకటస్వామి, ఉపాధ్యక్షులు సిరికొండ రవీంద్రచారి, మంచోళ్ల రాజమౌళిచారి, కార్యదర్శి రాగిపణి సతీష్‌చారి, సహాయ కార్యదర్శి వింజమూరి వెంకటాచారి, సిద్దేశ్వర్‌చారి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి తదితరులు


మంత్రి పొన్నంను కలిసిన రవీంద్రాచారి తదితరులు

### విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**సరూర్‌నగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, సదరు నిధుల పర్యవేక్షణ నిమిత్తం ప్రత్యేకంగా 'విశ్వబ్రాహ్మణ సంఘం కార్పొరేషన్' ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. శనివారం సంఘం ప్రతినిధులు వజ్రోజు రవీంద్రాచారి, రామదాసు లక్ష్మణాచారి, ఈశ్వరోజు బాలేశ్‌చారి, నారాయణదాసు సతీశ్‌చారి తదితరులు పొన్నంను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. తమ వర్గం ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి అవసరమైన సహకారం అందించాలని, ఇందుకుగాను ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు పొన్నంను కోరారు.

## గృహజ్యోతికి ప్రజాపాలన సేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు

- అర్హత కల్గిన వారికీ జీరో బిల్లులు
- రంగారెడ్డిజోన్‌లో 3.73లక్షల లబ్ధిదారులు
- రంగారెడ్డి జోన్ సీజీఎం పీ.ఆనంద్

**హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** అర్హత కల్గిన విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకానికి ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని రంగారెడ్డి జోన్ సీజీఎం పీ.ఆనంద్ తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియడంతో తెల్లరేషన్ కార్డు కల్గి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న వారంతా జీరో బిల్లుకు దరఖాస్తు చేసుకోవచ్చని శనివారం తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగియడంతో రంగారెడ్డి జోన్ పరిధిలోని సైబరాసిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్లలో జూన్ 6 నుంచే జీరో బిల్లులు జారీచేస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జోన్ నాలుగు సర్కిళ్లలో 3,73,400 మంది గృహజ్యోతి లబ్ధిదారులున్నారని అత్యధికంగా వికారాబాద్ సర్కిల్‌లో 1,14,455 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 1,01,737, సరూర్‌నగర్‌లో 93,516, సైబర్‌సిటీ సర్కిల్‌లో 63,692 మంది గృహజ్యోతి లబ్ధిదారులున్నట్లు తెలిపారు. జోన్ వ్యాప్తంగా జీరో బిల్లులు జారీచేస్తున్నామని, అయినా కొంతమంది దరఖాస్తు చేసుకునేందుకు స్థానిక విద్యుత్ కార్యాలయాలకు వస్తున్నారని, అర్హత కల్గిన వారంతా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వారి వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయగానే జీరో బిల్లు జారీ అవుతుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని అర్హత కల్గిన ప్రతిఒక్కరూ గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు పొందవచ్చన్నారు.


సీజీఎం ఆనంద్

## టీజీఎస్పీడీసీఎల్‌లో పేరుకుపోతున్న ఫైళ్లు

- ప్రతి పనికి సీఎండీని కలవాలంటున్న ఇన్‌చార్జి డైరెక్టర్లు
- కొత్త డైరెక్టర్ల ఎంపికపై ఉత్కంఠ

**హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో ఇన్‌చార్జి డైరెక్టర్ల తీరుతో ఫైళ్లు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. గత కొన్నిరోజులుగా ఇన్‌చార్జి డైరెక్టర్లు ఆయా విభాగాల్లో ఫైళ్లను పరిశీలించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏ పని కావాలన్నా డిస్కం సీఎండీని కలవాలని డైరెక్టర్లు చెబుతున్నారని కొంతమంది కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. డిస్కం పరిధిలో గత ప్రభుత్వ హయంలో సుమారు 80కి పైగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పనులు నిలిచిపోవడానికి స్థల వివాదం కారణం కాగా, అధికారులు అన్నింటికీ ఒకటే కారణం చూపి పనులు నిలిపివేశారని పలువురు ఆరోపిస్తున్నారు. కొత్త టెండర్లు పిలవడం లేదని, మెయింటెన్స్ పనులకు నిధులు కేటాయించడం లేదని, గ్రేటర్‌లో వందల ప్రాంతాల్లో 11 కేవీ ఫీడర్లు ఓవర్‌లోడ్ కారణంగా సరఫరాలో అంతరాయాలు తలెత్తుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### డైరెక్టర్ల పోస్టులకు ఆశావహుల ప్రయత్నాలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత డిస్కంలో పదేళ్లుగా డైరెక్టర్లుగా కొనసాగిన వారిని తొలగించడంతో పాటు కొత్త డైరెక్టర్ల నియామానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల కోడ్‌తో డైరెక్టర్ల నియామకం ఆలస్యం కావడంతో ఆయా విభాగాల్లో పనిచేస్తున్న వారినే ఇన్‌చార్జి డైరెక్టర్లుగా సీఎండీలు నియమించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో కొత్త డైరెక్టర్ల నియామకాలపై ఉత్కంఠ నెలకొంది. టీజీఎస్పీడీసీఎల్‌లో డైరెక్టర్ల పోస్టులకు ఇప్పటికే కొంతమంది ఆశావహులు కాంగ్రెస్ పెద్దలను కలుస్తూ ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. డైరెక్టర్ల నియామకాలకు ఓ ప్రత్యేక కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డిస్కంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్గి, సీనియర్ ఇంజనీర్లను డైరెక్టర్లుగా నియమించాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఐఏఎస్‌లు సీఎండీలుగా ఉంటూ అవినీతి ఆరోపణలు లేని సీనియర్ ఇంజనీర్లను డైరెక్టర్లుగా నియమిస్తే విద్యుత్ సంస్థల్లో మార్పులు తీసుకువచ్చే అవకాశముంటుందని సీనియర్ రిటైర్డ్ ఇంజనీర్లు సూచిస్తున్నారు.

## రివార్డు, గిఫ్ట్ కూపన్‌ల పేరుతో సైబర్ వల

- ఏపీకే ఫైల్, సందేశం పంపి నగదు దోపిడీ

**హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** ప్రగతినగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి చైతన్యకు స్టేట్ బ్యాంక్ పేరుతో వాట్సాప్‌లో ఓ సందేశం వచ్చింది. మీ బ్యాంక్ ఖాతాకు ఎస్‌బీఐ రివార్డు రూ. 7,250 యాక్టివేట్ అయిందని, ఈ రోజుతో దాని కాలపరిమితి ముగుస్తుందని మెసేజ్ వచ్చింది. రివార్డు కావాలంటే కింద పంపిన లింక్ ద్వారా ఎస్‌బీ రివార్డు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని, క్లెయిమ్ చేసుకుంటే మీ ఖాతాలో డబ్బు జమ అవుతాయని సందేశంలో ఉంది. తన నెంబర్‌తోపాటు, స్నేహితులు, సహోద్యోగులు ఉన్న వాట్సాప్ గ్రూపులో కూడా ఇదే మెసేజ్ రావడంతో కొంతమేరకు నమ్మకం వచ్చింది. స్నేహితుడు కూడా ఇదే మెసేజ్ పంపడం, మెసేజ్ వచ్చిన నెంబర్ డీపీలో బ్యాంక్ లోగో ఉండడం, చాలాకాలంగా ఎస్‌బీఐ ఖాతా ఉండడంతో రివార్డు నిజమని భావించిన చైతన్య ఏపీకే లింక్‌ను ఓపెన్ చేశాడు. ఎస్‌బీఐని పోలిన వెబ్‌సైట్(ఎస్‌బీఐ రివార్డ్స్) ఓపెన్ కావడంతో, ఖాతా వివరాలు, కార్డు, సీవీవీ వివరాలు నమోదు చేశాడు. కొంతసేపటికి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు విత్‌డ్రా అయినట్లు సందేశాలు రావడంతో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### సమాచారం చోరీ..

ఓటీపీ, ఓఎల్ఎక్స్ మోసాలపై అవగాహన పెరడగంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో ముందుకు వెళ్తున్నారు. ప్రముఖ బ్యాంక్‌లు, సంస్థలు, ఈ కామర్స్ సైట్ల పేర్లను దీనికోసం వాడుతున్నారు. సిమ్‌లను సేకరించి, వాటికి ప్రముఖ సంస్థలు, బ్యాంక్‌ల లోగోలు, పేర్లు తగిలిస్తున్నారు. పలువురికి రివార్డు, ఆఫర్ కూపన్‌ల పేరుతో లింక్‌లను పంపుతున్నారు. లింక్ ఓపెన్ చేస్తే, దాని ద్వారా ఫోన్‌ను హ్యాక్ చేయడంతోపాటు సమాచారాన్ని కూడా తస్కరిస్తున్నారు. సందేశాలు ఎక్కువ మందికి వెళ్లేలా పలు వాట్సాప్, టెలిగ్రాం గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. ఇది నిజమా? కాదా? అని కూడా నిర్ధారించకుండా కొంతమంది తమ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు ఇదే సందేశాన్ని ఫార్వర్డ్ చేస్తున్నారు. పంపింది స్నేహితుడే కదా అని, ఓపెన్ చేసిన వారు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు. ఫోన్‌లో ఉన్న సమాచారాన్ని సేకరించిన సైబర్ నేరగాళ్లు, ఖాతా వివరాలు సేకరించి డబ్బు కాజేయడంతో పాటు, సమాచారం, వీడియోలు, ఫొటోలు సేకరించి వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి సందేశాలను వెంటనే డిలీట్ చేయాలని సైబర్ క్రైం అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు.



వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన, ఎస్‌బీఐ రివార్డు పేరుతో సందేశం, ఏపీకే ఫైల్

## పాత కక్షల నేపథ్యంలో యువకుడి హత్య

- పథకం ప్రకారం నిర్మానుష్య ప్రదేశానికి పిలిచి..
- కత్తితో గొంతు కోసి హతమార్చిన వైనం

**సరూర్‌నగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** ఇరు కుటుంబాల మధ్య ఉన్న పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిని పథకం ప్రకారం నిర్మానుష్య ప్రదేశానికి పిలిచి హత్య చేసిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం ప్రాంతానికి చెందిన సల్మాన్(25)కు అదే ప్రాంతంలో నివసించే దాసరి సురేందర్ అలియాస్ సూరితో కుటుంబపరమైన గొడవలు ఉన్నాయి. సూరి గతంలో సల్మాన్ సోదరి షబా ఫాతిమాను ప్రేమ వివాహం చేసుకుని, అనంతరం ఇద్దరి మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా ఆమెను భవనంపై నుంచి కిందకు తోసి చంపేశాడు. ఆ తర్వాత సల్మాన్ బంధువుల అమ్మాయితో సూరి సన్నిహితంగా ఉంటున్నట్టు తెలిసింది. అప్పటి నుంచి సూరిపై కక్ష పెంచుకున్న సల్మాన్ ఎలాగైనా అతడిని మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. కాగా సల్మాన్ వల్ల తమకు ఎన్నటికైనా ముప్పు తప్పదని గ్రహించిన సూరి.. సల్మాన్ అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. ఈ క్రమంలో తనతో చనువుగా మెలిగే సల్మాన్ బంధువు కూతురితో శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో సల్మాన్‌కు ఫోన్ చేయించి, ఇకపై గొడవలకు పోకుండా కూర్చుని మాట్లాడుకుందామని టీకేఆర్ కమాన్ సమీపంలోని అయ్యప్ప ఆలయం వెనుక గల నిర్మానుష్య ప్రదేశానికి పిలిపించాడు. ఆమె మాటలు నమ్మి సల్మాన్ అక్కడకు వెళ్లగా పథకం ప్రకారం సూరి తన అనుచరులతో కలిసి అతడిపై కత్తులతో దాడిచేసి, గొంతుకోసి హతమార్చారు. విషయం తెలుసుకున్న సల్మాన్ సోదరుడు అర్బాజ్ అక్కడకు వెళ్లి సల్మాన్‌ను సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు చెప్పారు. హతుడి తల్లి షబనాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, హత్యకు పాత కక్షలే కారణమని ప్రాథమికంగా నిర్ధారణ అయిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఆయన చెప్పారు. సల్మాన్ సైతం పాత నేరస్థుడేనని, పలు కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చాడని పోలీసులు తెలిపారు.


సల్మాన్(ఫైల్)




రాజీ కుదుర్చుకున్నవారికి పత్రాన్ని అందజేస్తున్న హైకోర్టు జడ్జి సుజోయ్‌పాల్

## రాజీమార్గమే రాజమార్గం

- హైకోర్టు జడ్జి సుజోయ్‌పాల్

**రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** రాజీ మార్గమే రాజమార్గమని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు జడ్జి సుజోయ్ పాల్ అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టుల ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుజోయ్‌పాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కేసులో రాజీ చేసుకోవడానికి లోక్‌అదాలత్ మంచి వేదికన్నారు. రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలు గెలిచినట్లేనని చెప్పారు. కేసులు పరిష్కరించడంలో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. కుటుంబ తగాదాలతో విడిపోయిన ఒక జంటను లోక్‌అదాలత్ వేదిక ద్వారా కలిపి సంతోషంగా జీవించాలని జడ్జి సుజోయ్‌పాల్ పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వదించారు. జాతీయలోక్ అదాలత్ ప్రీలిటిగేషన్ కేసులు అన్ని కలిపి 1,20,000లకు పైగా పరిష్కరించబడ్డాయి. అన్ని కేసుల్లో సుమారు రూ.5,85,22,552ల వరకు నష్టపరిహారం కక్షిదారులకు ఇప్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు, జిల్లా జడ్జిలు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, రంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సంయుక్త కార్యదర్శి రాధాకృష్ణ, ఇతర న్యాయవాదులు, ప్యారాలీగల్ వలంటీర్లు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

### హయత్‌నగర్ కోర్టులో..

**హయత్‌నగర్:** హయత్‌నగర్‌లోని 14వ మెట్రోపాలిటన్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 14వ అదనపు జడ్జి సల్మా ఫాతిమా ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 4,055 కేసులు రాజీ కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో 7వ అదనపు జడ్జి సాకేత్‌మిత్రా, రిటైర్డ్ జడ్జి రవికుమార్, ఏపీపీ అరుణోదయకుమార్, నూతన్‌కుమార్ పాల్గొన్నారు.

## 27వేల మంది కార్మికులకు బాండ్ల బకాయిలు చెల్లించాలి

- ఆర్టీసీ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు

**హైదరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీలో 2013 పీఆర్‌సీ బాండ్ల బకాయిలు 27వేల మంది కండక్టర్‌లు, గ్యారేజీ సిబ్బందికి తక్షణం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. పదేళ్ల క్రితం కార్మికులు బాండ్ల రూపంలో దాచుకున్న డబ్బులను చెల్లించకుండా జాప్యం చేయడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. కార్మికుల బాండ్ల బకాయిల చెల్లింపుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి గత ఫిబ్రవరి 10న ఆర్టీసీ ఎండీకి రూ.280 కోట్ల చెక్కును అందించినప్పటికీ నాలుగు నెలలుగా పెండింగ్‌లో పెట్టారని ఆయన విమర్శించారు. స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమైనందున కార్మికుల కుటుంబాల పిల్లల విద్యా అవసరాలను పరిగణలోకి తీసుకుని బాండ్ల బకాయిలను తక్షణం చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### గ్రూప్-1 పరీక్షలకు అదనపు బస్సులు

**చాదర్‌ఘాట్:** టీజీపీఎస్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం టీజీఎస్‌ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో నుంచి అదనపు బస్సులు నడపనున్నట్లు మేనేజర్ హరి తెలిపారు. అభ్యర్థుల కోసం డిపోలో షెడ్యూల్ బస్సులతోపాటు అదనపు బస్సులు నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. 30 నుంచి 40 మంది అభ్యర్థులు ఉంటే వారున్న నివాసాల నుంచే పరీక్షా కేంద్రానికి బస్సు నడుపుతామని తెలిపారు.